# వరాళి

శంకరం ఉసూరుమంటూ యింటికి చేరుకున్నాడు. పైపంచ కుర్చీమీద వేసి విసుగ్గా మంచంమీద కూలబడ్డాడు.

"కాళ్ళు కడుక్కోకుండానే అలా కూలబడ్డారేం" అంది పలకరింపుగా-అప్పుడే లోపలనుంచి యివతలి గదిలోకి వచ్చిన ఆయన భార్య కామాక్షమ్మ.

శంకరం జవాబు చెప్పకుండా మంచంమీంచి లేచాడు. దుస్తులు మార్చుకుని మళ్లీవచ్చి కూర్చున్నాక ఆమె అడిగింది. "అయినా యేమిటండీ, మరీ అంత పరధ్యానం? నాలుగు రోజులనుంచి చూస్తున్నాను మరీ అంత పని ఎక్కువగా ఉందా ఆఫీసులో". శంకరం నీరసంగా నవ్వాడు. అంతా భార్యతో చెప్పివేయాలని వుంది. ఇంతవరకూ ఆమెకు యేమీ చెప్పలేదు. ఈ సంఘటన యెలా చెప్పాలో అర్థం కాలేదు ఆయనకు. తన ప్రయత్నం కొనసాగి రాంమూర్తి మళ్ళీ ఉద్యోగంలో చేరినట్లయితే, అసలు ఈ సంగతి ఆమెకు చెప్పవలసిన అవసరమే ఉండేది కాదు. కాని అట్లా జరగలేదు.

శంకరం నిర్మించుకున్న గాలిమేడ కాస్తా కూలిపోయింది. అట్లా కూలిపోకుండా దాన్ని ఎలాగయినా నిలబెట్టాలని ఆయన ఎంతో ప్రయత్నం చేశాడు. తన బుజంవొడ్డి నిలిచాడు కూడా. కాని ప్రయోజనం లేకపోయింది.

కామాక్షమ్మ కాఫీ తీసుకు వచ్చింది. భర్తకు గ్లాసు అందించి పక్కగా కూర్చుంది. కాఫీ చప్పరిస్తూ శంకరం "అమ్మాయేదీ" అన్నాడు ఏదో పలకరించాలని.

"పెద్దది వాళ్ళ స్నేహితురాలు గిరిజ ఇంటికి వెళ్ళింది. ఇంకో అరగంటకు కాని రాదు. రెండోది ఇంకా బడినుండి రాలేదు. మూడోదాన్ని

యింతకుముందే బజారుకు పంపాను. కాఫీపొడికోసం'' అంది ఆమె.

కాఫీ తాగడం పూర్తిచేసి గాఢంగా నిట్టూర్చాడు శంకరం. ''మనం అనుకున్నదంతా తారుమారు అయింది'' అన్నాడు. అతి సాధారణంగా యీ మాటలు అనాలని పెద్ద ప్రయత్నంచేసి, ''ఏమయిందండీ'' అంది ఆమె అతి ఆదుర్దాగా.

''నీవేం దిగులు పడకు. కాకపోతే కాక పోయిందిలే. కాని దాని కోసం ఎందుకు బెంగపడడం?''-యింకా తాపీగా అన్నాడు. కామాక్షమ్మకు కాస్తవిసుగు అనిపించింది. కాని విసుగును పైకి కనిపింపజేస్తే చెప్పేకాస్త కూడా చెప్పడని మరింత నిదానంగా అంది: ''యేమయిందో చెప్పండి. నేను బెంగపడడం సంగతి తరువాత చూసుకుందాం''

''అదే మన సరోజ విషయం!'' అంటూ నీళ్ళు నమిలాడు. సరోజ అంటే వాళ్ల పెద్ద అమ్మాయి.

''అబ్బ, త్వరగా చెప్పండి. మన సరోజకేం. అన్నీ కలిసివస్తే యీ సంవత్సరం వివాహంకూడా చేసేస్తాంకదా!''

''అదే చెప్పవస్తున్నాను సరోజకు మా ఆఫీసులో రాంమూర్తిని మాట్లాడుదాం అనుకున్నాంగదా. అది యిప్పుడు కుదరదు''

కామాక్షమ్మ మూర్ఛ పోతుందేమో అనుకున్నాడాయన, కాని ఆమె అటువంటి పని చేయలేదు,

''ఏం, ఎందుకు కుదరదు? పిల్లవాడు లక్షణంగా వున్నాడని చెప్పారుగా''

''పిల్లవాడికేమీ కాలేదు. వాడి ఉద్యోగమే పోయింది!''

''అయ్యోపాపం. ఏమన్నా కానిపని చేశాడా? మీరు సహాయం చేయ లేక పోయినారా!''

''అట్లా జరిగినా బాగుండును. కుర్రవాడు మంచిపనే చేశాడు. కాని ఉద్యోగం మటుకు చెయ్యనుగాక చెయ్యను-అని భీష్మించుకు కూర్చు న్నాడు.''

శంకరం రామ్మూర్తి ఎంత నిజాయితీ పరుడయిందీ. అంత పచ్చి నిజాయితీ పరులకు యీ రోజులు ఎట్లా మంచివికానిదీ అంతా వివరించి చెప్పి అతను నిరుద్యోగి అయిన తీరు తెలియపరిచాడు.

కామాక్షమ్మ అతగాడి ఉద్యోగం పోయినందుకు చాలా బాధపడింది. పాపిష్టి రోజులను తిట్టిపోసింది. కాని అతడి ఉద్యోగం పోవటానికి, పెళ్ళి జరిపించకపోవటానికి సంబంధం ఏమిటో ఆమెకు అవగాహన కాలేదు.

“పోతే పోయింది వెధవ ఉద్యోగం. నిమిషాలమీద మరో ఉద్యోగం-మంచిది-చూసుకుంటాడు. పిల్లవాడు బంగారం లాంటివాడు. అయితే ఎక్కడో అక్కడ ఉద్యోగం దొరక్కపోదు!”

ఆమె అవివేకానికి శంకరం తనలో తను నవ్వుకున్నాడు. రామ్మూర్తి ఉద్యోగం మానేసి ఇవాళ్టికి నాలుగు రోజులయింది. ఏదో వేరే ఉద్యోగం—మంచిది? ఈ రోజుల్లో ఉద్యోగం దొరకటం ఎంతకష్టమో ఆమెకేం తెలుస్తుంది?

“ఇందుకేనే మీ దిగులంతా? ఇంతకూ అతనితో పెళ్ళి విషయం కదిపారా?”

“ఇంక కదిపి మాత్రం ప్రయోజనం ఏమిటి! నిరుద్యోగికి నా పిల్లను యిచ్చి దాని గొంతెట్లా కోయను?” అన్నాడు శంకరం-బొంగురు పోయిన గొంతుతో.

కామాక్షమ్మకు ఏడవాలో నవ్వాలో తెలియలేదు. వయసు మీరుతున్న కొద్దీ ఈయనకు వివేకం అడుగంటుతోంది-అనుకుంది. అంతకంటే ఇంకేం అనుకోవాలి?

ఆ కుర్రవాడు తమకేమీ బంధువు కాడు. ఇంతవరకూ తను ఆ కుర్ర వాడిని చూడనయినా లేదు. రెండు మూడు నెలలక్రితం అయనే చెప్పారు తనకు ఈ సంగతి. అప్పటికి అయిదారు నెలలుగా తానొక్కడే మనసులో ఆలోచించుకుని నిశ్చయానికి వచ్చినట్లుకూడా చెప్పారు.

"కుర్రవాడు బుద్ధిమంతుడు. నాలుగేళ్ళుగా నా దగ్గరే పనిచేస్తు న్నాడు. నే నంటే ఎంతో గౌరవం, అపేక్ష. చక్కగా ఉద్యోగం చేసు కుంటున్నాడు. ముందు ముందు అభివృద్ధిలోకి వస్తాడు. మన పెద్ద అమ్మా యికి ఈడూ జోడూను:" అన్నారాయన.

నాలుగేళ్లనించి అమ్మాయికి వివాహం చేయాలని యోచన. కట్నాలూ కానుకలూ ఇచ్చేస్తోమతు లేదు గనుక ఇంతవరకు ఏ సంబంధమూ స్థిరం చేసుకోలేక పోయినారు.

"మీ దగ్గర పని చేస్తూ వుంటేమటుకు కట్నంమీద ఆశలేకుండా ఉంటుందా?"

"లేదు. కట్నం పుచ్చుకోనని నాకు అనేకమార్లు చెప్పాడు"

"మన అమ్మాయిని చూడకుండానే చేసుకుంటాడా" మరీ ఆశ్చ ర్యంతో అంది, యింకేం అనాలో తోచక. ఆ కుర్రవాడు కట్నంలేకుండా చేసుకోటానికి సిద్దమే అయినా ఆ విషయం తన మనస్సుకు పట్టించుకోవడం చాలా కష్టం అయిపోయింది.

"నేనతని దగ్గర యీ ప్రస్తావన యింకా తీసుకురాలేదు. నీతో చెప్పి, ఓ మారు అతన్ని మన యింటికి తీసుకువచ్చి నీకు చూపించి, ఆ పైన అతడితో మాట్లాడుదాం అనుకున్నాను."

రెండు మూడు నెలలు గడచిపోయినా యింకా ఆ పనులు యేమీ చేయడం కుదరనేలేదు. శంకరం యే పనీ త్వరత్వరగా చేయడు.

అప్పటికి యిప్పుడు-మళ్ళీ ఆ కుర్రవాడి గురించి యింట్లో ప్రస్తావన వచ్చింది.

"యింతకు మీకు అనేది యేమిటో అర్థం కావడం లేదు నాకు."

"నీకు చెప్పడంకంటె ఆ గోడకు చెప్పడం తేలిక. అంతా తల్లకిందు లయిందని నేను అఘోరిస్తూ వుంటే మధ్య నీ నస యేమిటి?"

—కామాక్షమ్మకు ఆయన ధోరణి సుతరామూ నచ్చలేదు. అడిగిన కొద్దీ చిరాకు పడడం ఎక్కువయిపోతుంది. అందుకని ఆమె ఆ విషయం ప్రస్తావన చేయడం అక్కడికి ఆపేసింది, ఆమె అక్కడనుంచి లోపలకు వెళ్ళిపోయింది కూడా. శంకరం ముందు గదిలో ఒక్కడూ కూర్చుండి పోయాడు. తనలో తనే ఆలోచించుకోసాగాడు. ఆలోచన తెగడం లేదు. ఆయనకు విసుగు కూడా వచ్చేసింది. ఆ విషయాన్ని బలవంతంగా మనసు లోంచి బయటకు నెట్టివేశాడు.

ఒక అరగంటసేపు అక్కడే విరామంగా కూర్చున్నారు. ఆ తరువాత పెరట్లోకి వెళ్ళి హాయిగా చన్నీటిస్నానం చేశాడు. ఆయన స్నానం చేసి లోపలకు వచ్చేసరికి ముగ్గురు అమ్మాయిలూ ఇంటికి వచ్చి వున్నారు. ఆయన పిల్లల్ని లాంఛన ప్రాయంగా పలుకరించాడు. తరువాత అందరూ భోజనాలకు కూర్చున్నారు.

అక్కడా ఆయన యేమీ మాట్లాడలేదు. ముభావంగా భోజనంచేసి బయటకు వచ్చేశాడు.

కామాక్షమ్మ భోజనం ముగించి వంటగది సద్దుకుని యివతలకు వచ్చేసరికి రాత్రి తొమ్మిదిగంట లయింది. శంకరం మంచంమీద అటు యిటు దొర్లుతున్నాడు. పిల్లలు ముగ్గురూ పక్కగదిలో పడుకున్నారు. చిన్నవాళ్ళు యిద్దరూ అప్పుడే నిద్రపోయారు. పెద్దమ్మాయి సరోజ అప్పుడే దీపం మలిపి పడుకుంటూవుంది.

"ఇంకా నిద్రపోలేదా అమ్మా!" అంది కామాక్షమ్మ.

"ఇప్పుడే నిద్ర వస్తోంది" అని సరోజ దుప్పటి ముసుగు పెట్టుకుంది.

కామాక్షమ్మ వరండాలోకివచ్చి కూర్చుంది. శంకరం మంచంమీదనే లేచి కూర్చుని తన ధోరణిలో-"నీది అసలే మట్టిబుర్ర. చెప్పేదికాస్త జాగ్ర

త్తగా విను, మళ్లీ మళ్లీ చెప్పమంటే నాకు చిరాకు అనిపిస్తుంది'' అంటూ ప్రారంభం చేశాడు.

"ఊ చెప్పండి వింటున్నాను'' అంది కామాక్షమ్మ.

"రాంమూర్తి చురుకయిన కుర్రవాడు. అతనికి మన పెద్ద అమ్మాయిని యిస్తే బాగుంటుందని నేను మనసులో నిశ్చయించుకున్నాను. ఇంతలో ఈ విఘాతం జరిగింది.''

"ఉద్యోగం పోవడమేనా? నాకు అదో అడ్డంకిగా కనిపించడం లేదు. కుర్రవాడు మంచివాడైతే చాలు.''

"అందుకనే నిన్ను నోరు మూసుకుని వినమన్నాను. రాంమూర్తికి యేమీ ఆస్తి పాస్తులు లేవు. ఉద్యోగమే ఆధారం. ఆ ఉద్యోగం కాస్తా ఊడిపోయింది. అతనికి మళ్లీ ఉద్యోగం దొరికే ఆశ నా కెక్కడా కను చూపు మేరలో కనిపించడంలేదు. ఉద్యోగం లేనివాడికి పిల్లనిచ్చి పెళ్ళి చేయక పోతేనేం?''

"నాకు అందుకనే మీ వాదన నచ్చదు. ఇవాళ ఉద్యోగం లేని వాడికి ఎల్లకాలం లేకుండా వుంటుందా? ఆస్తి పాస్తులు వున్నవాళ్ళకు బోలెడంత కట్నం యివ్వాలి. అది మనవల్ల కాదని యిదివరకే తేల్చేసు కున్నాం. రాంమూర్తి ఒప్పుకుంటే ఈ సంబంధం చేయవచ్చనే నాకు అనిపిస్తూంది.''

"ఆస్తిలేక, ఉద్యోగమూలేక వాళ్ళు ఎలా బతుకుతారు?''

"ఇంతకూ మీరు రాంమూర్తిని కదిపి చూచారా లేదా?''

"నేనడిగితే అతడు కాదనడనే నా నమ్మకం.''

"మరయితే యేమిటి యింక మీ ఆలోచన?''

"మళ్ళీ మొదటికి వచ్చావు. అందుకే నీతో మాట్లాట్టం అంటే నాకు చిరాకు.''

"కామాక్షమ్మకు యింతకు పదిరెట్లు చిరాకు కలిగింది. కాని అంతటినీ తాను తనలోనే అణచుకుంది. 'చాదస్తంమొగుడు చెబితే వినడు. గిల్లితే యేడుస్తాడు —' అన్న సామెత గుర్తుకు వచ్చింది.

"అయితే ఏం చేస్తాం?" అంది కామాక్షమ్మ.

"అదే తేలక కొట్టుకుంటున్నాను. నాలుగు రోజులనించీ. అతన్ని బతిమాలుతున్నాను ఉద్యోగం మానవద్దని. కాని అతని మనసు మాత్రం మారేట్లులేదు."

"అయితే అతనంతట అతను మాని వేశాడా? యింతకంటే మాంచి ఉద్యోగం ఏదయినా వచ్చిందేమో!"

"అబ్బ-అటువంటిదేమీ కాదు. మాట పట్టింపువచ్చి అతడే ఉద్యోగం మాని వేశాడు. రాజీనామా వ్రాసి యిచ్చేశాడు. ఉద్యోగం అన్న తరువాత యిటువంటి మాట పట్టింపులు పెట్టుకోకూడదు-మన పని మనం చేసుకుపోవాలి-అని నేను తెగ నూరిపోశాను. కాని ఉడుకురక్తం-నా మాట వినడంలేదు."

"పోనీ మన యింటికి ఒకసారి తీసుకురాక పోయారా? మన సరోజను చూస్తే వొప్పుకుంటాడేమో."

"ఆ పని యిదివరకే చేయవలసింది. కాని చేయలేదుకదా! ఉద్యోగం విషయం యేదో ఒకటి తేలకపోతే—ఈ ప్రస్తావన తీసుకురావడం ఎట్లా?"

"ఆ అబ్బాయి వొప్పుకుంటే-మళ్లీ ఉద్యోగంలో చేరటానికి వీలుందా?"

"ఆహా, లక్షణంగా! కాగితాలు యింకా నా దగ్గరే వున్నాయి. యింకా పైకి పంపించలేదు. రెండు మూడు రోజుల్లో సంపెయ్యాలి ఆపటానికి లేదు."

"ఉద్యోగం లేనివాడితో సంబంధం ఎట్లాగూ అని మీరుఅనుకుంటే-ఈ విషయం మర్చిపోయి హాయిగా నిద్రపోండి."

"అటా నిద్రపోవటానికి చేతగాకనే కదా యిట్లా యేడుస్తూ వున్నది! ఎట్లాగయినా పెద్దమ్మాయికి ఈ సంవత్సరం పెళ్ళి చేసేద్దాం అనుకున్నాంకదా!"

కామాక్షమ్మ మనసు వుడికిపోతూవుంది. ఈ సంబంధం ఆయనకు ఎందుకు కాదనిపిస్తోందో బుర్రకు ఎక్కడంలేదు. ఈ మనిషితో వాదించీ యేమీ ప్రయోజనంలేదు. అనకూడదుగాని వొట్టిమూర్ఖుడు అనుకుంది. శంకరం అర్ధస్వగతంగా యిలా అనుకున్నాడు "రాంమూర్తి వొప్పుకుంటే మళ్లీ ఉద్యోగంలో చేరుస్తాను. హాయిగా సరోజనిచ్చి పెళ్ళిచేస్తాను. సరోజ సుఖపడుతుంది. కాని అతగాడు ఒప్పుకోవడం లేదుగదా. ఎట్లా? సరోజకు ఈ జన్మలో పెళ్ళిచేయలేను. నా బతుకంతా యిలా ఆలోచనలతో తెల్లవారి పోవలసిందే!"

పక్కగదిలో సరోజ నిజానికి యింకా నిద్రపోలేదు. ఆమె తల్లి దండ్రుల సంభాషణ స్పష్టంగా విన్నది. ఆ రాత్రి యింక ఆమెకు నిద్ర పట్టలేదు.

* * *

మరునాడు ఉదయం సరోజ చాల ఆలస్యంగా నిద్రలేచింది. తల్లి ఆమెను నాలుగయిదుసార్లు లేపటానికి ప్రయత్నంచేసి కూడా మళ్లీ ఊరుకుంది. సరోజకు వళ్ళంతా బరువుగా వున్నట్లుంది. తల మరీ భారంగా తయారయింది, ముఖం కడుక్కొని కాఫీతాగిన తర్వాత "కొంత నయం" అనిపించింది. కామాక్షమ్మ "యేమే అట్లాఉన్నావు, ఒంట్లో సరిగ్గావుందా?" అంది. సరోజ లేని నవ్వు తెచ్చుకుని "నిద్ర యెక్కువయి బద్ధకంగా వున్న దమ్మా" అంది. కామాక్షమ్మ యేమనుకుందో యేమో "గదిలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకో తల్లీ" అంది.

సరోజ గదిలో ఒక్కత్తే కూర్చుని రాత్రి తాను విన్న సంగతులన్నీ నెమరువేసుకుంది. తల్లి, తండ్రి రాంమూర్తిని గురించే మాట్లాడుకున్నారు.

రెండుమూడు సార్లు అతను నాన్నతోకూడా తమ యింటికి వచ్చాడు-ఆ విషయం వాళ్ళకు గమనంలేదు.

అయితే తనను రామమూర్తికి యిద్దామనుకున్నాడన్న మాట నాన్న-అతనిరూపం మనసులోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేసింది సరోజ. యెక్కువప్రయత్నం లేకుండానే అతని రూపం ఆమెకు మనః ఫలకంమీద ముద్రితం అయింది. సరోజ సిగ్గుగా తల వంచుకుని అద్దంలో చూచుకుంది. చెంపలు ఎర్రగా కనిపించాయి.

తన వెర్రికి తనే నవ్వుకుంది. నాన్నచెప్పిన అభ్యంతరం ఆమెకు ఎదురుగా గోడ పెట్టినట్లుగా కనిపిస్తోంది. రాంమూర్తికి ఉద్యోగం లేదు-ఉద్యోగంలేని రాంమూర్తికి నాన్న తనను యివ్వడు. ఆయన తనకు పెళ్ళి చేయడు. చేయలేనని తనే స్వయంగా ఒప్పుకుంటున్నాడు కదా.

ఇంకా అమ్మ చెప్పిన మాట బాగుంది! నాన్న అమ్మమాట వినడు. ఆయనకు స్వతహాగా తోచదు. తోచినవాళ్ళు చెబితే వినలేడు. సరోజకు నాన్నమీద కోపం వచ్చింది-ఆ క్షణంలో.

పాపం-నాన్న-అనుకుంది-ఆయన ఉద్దేశ్యాలు మంచివే. తనకు ఎట్లాగయినా మంచి సంబంధం చూచి పెళ్ళి చేయాలని ఆయన బాగా తాపత్రయపడుతున్నాడు.

రాంమూర్తి రూపం మళ్ళీ ఆమె మనసులో మెదిలింది. రాంమూర్తి అందంగా వుంటాడు. అతడు తనను వివాహం చేసుకుందుకు ఒప్పుకుంటే చాల బాగుంటుంది. అతడు ఒప్పుకుంటాడు. అయినా ఎలా ఒప్పుకుంటాడు?-ఎవరయినా వెళ్ళి అడగాలి కదా! అనుకుంది సరోజ. నాన్న అడగనన్నాడు. ఇంక ఎవరు అడుగుతారు? నాన్న అడిగితే అతడు ఒప్పుకుంటాడు. నాన్న

అడగడు. సరోజకు దుఃఖం వచ్చింది. రాంమూర్తిమీద కోపం వచ్చింది తనమీద తనకే కోపం వచ్చింది.

రాంమూర్తికి ఉద్యోగం ఉంటే అంతా సవ్యంగా జరిగిపోతుంది. నాన్న అదే చెప్పాడు. అతడు ఉద్యోగం చేస్తానంటే ఉద్యోగం వుంది. తనకు రాంమూర్తితో వివాహం కావాలంటే అతడు నాన్న చెప్పినట్లు విని ఉద్యోగంలో చేరాలి. నాన్న చెబితే అతడు ఉద్యోగంలో చేరనన్నాడు. ఇంకెవరు చెబితే చేరతాడు? సరోజకు దుఃఖం ముంచుకు వచ్చింది.

ఇంక నాకు పెళ్ళికాదు. నా తరవాత ఇద్దరూ చెల్లెళ్ళకూ పెళ్ళి కాదు. అందరూ వృద్ధ కన్యలుగా వుండిపోవలసిందే!

పోనీ నేనే వెళ్ళి అడిగితేనో—అనుకుంది సరోజ. అతను మంచి వాడు. అతనికి ఉద్యోగమూ నిలుస్తుంది. నాకు పెళ్ళి అవుతుంది. ఇద్దరం ఆరోగ్యంగా వుండవచ్చును—సరోజ మనస్సు కొంతసేపు గాలిలో తేలింది. ఆనందంగా కాసేపు విహరించింది. తనలో తనే ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

తనే వెళ్ళి యెట్లా అడగడం? తను యేమని మాట్లాడగలుగుతుంది? ఎట్లా మాట్లాడగలుగుతుంది? సరోజకు మళ్లీ నీరసం వచ్చింది. అనుకున్న దంతా మళ్ళీ పాడయిపోయింది. నాన్న మాదిరే తనకు ఆలోచనలు జాస్తి. ఊరికే ఆలోచిస్తూ కూర్చుంటే యేమవుతుంది? మంచో చెడో ఆలోచనలను ఆచరణలో పెడితే అటో ఇటో తేలిపోతుంది. సరోజ రాంమూర్తి దగ్గరకు వెళ్ళి మాట్లాడాలనే అనుకుంది. ఎట్లా మాట్లాడాలో తనలో తను 'రిహార్సలు' వేసుకుంది. అతను యేమంటాడో ఊహించుకుని జవాబులు చెప్పుకుంది

ఆలోచించుకున్నప్పుడు అంతా చక్కగా వున్నట్లే కనిపిస్తుంది. కాని తీరా అడుగుతీసి అడుగు వేయాలంటే మనస్సు గుబగుబలాడింది. ఏమవు

తుందో అని భయం. ఏమవుతుంది? ఏదో ఒకటి అవుతుంది, ఏమీ చేయకపోతే అసలు యేమి అవనే అవదు కదా, ఎట్లాగయినా కానీ రాంమూర్తితో మాట్లాడాలనే గుండెధైర్యం తెచ్చుకుంది.

రాంమూర్తి వుండే గది ఆమెకు తెలుసు. మహిళా మండలికి వెళ్ళే దారిలోనే వుంది అతడిని ఆ గదిలో అనేకమార్లు చూసింది కాని, పట్టించుకోలేదు.

సరోజ ఆ సాయంకాలం వెడదామనుకుంది. సాయంత్రం ఎవరో స్నేహితురాలి యింటికి వెడుతున్నట్లుగా వెళ్ళి అతనితో ఆ నాలుగు ముక్కలూ మాట్లాడి వచ్చేస్తే యేదో వొకటి తేలిపోతుంది. కనీసం నాన్న బెంగ అయినా తీరుతుంది అనుకుంది.

సాయంత్రం ఆకాశం అంతా మబ్బులు మబ్బులుగా వుంది. వాన వచ్చేటట్లుంది గాని - రావడంలేదు. సరోజ బయలుదేరింది. ఆ రోజంతా ఆమెకు వెళ్ళడమా వద్దా అనే సందిగ్ధంతోనే సరిపోయింది. వెళ్ళకుండా వుండడంకంటే వెళ్ళడమే మంచిది అనుకుంది, తనకు తానే ధైర్యం చెప్పుకుంది.

సరోజ సరాసరి రాంమూర్తి గదికి వెళ్ళింది. గది తలుపులు దగ్గరకు వేసిఉన్నాయి. ఆమె వెళ్ళేసరికి అతను చాపమీద పడుకుని దొర్లుతున్నాడు. ఎవరో గదిలోకి రావడం చూసి అకస్మాత్తుగా లేచి నించున్నాడు. సరోజ చొరవగా నాలుగు అడుగులు ముందుకు వేసింది. అతను ఆమెవంక తేరిపార చూస్తూ "మీరు_మీరు" అన్నాడు. ఆమె గుండె ఒకచేతితో పట్టుకుంది. మనస్సు ఇంకొకచేతితో పట్టుకుంది. ధైర్యం తెచ్చుకుంటూ "నేను శంకరంగారి అమ్మాయిని. నా పేరు సరోజ" అంది.

"ఓహో! అలాగా! మీరు ఫలానా అని నాకు తెలీదు. కాని యీ రోడ్డువెంట వెళ్ళడం అనేకసార్లు చూశాను. నాన్నగారు పంపించారా, యేమిటి చెప్పండి?" అన్నాడు తెల్లబోతూ రాంమూర్తి.

సరోజ తాను చెప్పదలుచుకున్నదంతా ఒక్క గుక్కలో చెప్పాలనుకుంది. లేకపోతే చెప్పడం తనవల్లకాదు.

“నిలుచునే వున్నారే! కూర్చోండి” అన్నాడు రాంమూర్తి - కుర్చీ చూపిస్తూ. ఆ గదిలో ఒకటే కుర్చీ వుండడం గమనించింది సరోజ. తను కుర్చీలో కూర్చుంటే ఆతను నిలబడే వుండిపోవాలి. ఆమె చాపమీద ఒక మూలగా కూర్చుంది,

“అయ్యో. కింద కూర్చున్నారే!” అన్నాడు రాంమూర్తి.

“ఫర్వాలేదులెండి” అంటూ ఆమె గొంతు బిగతీసుకొని చెప్ప సాగింది.

“దయచేసి నేను చెప్పే మాటలు బాగా వినండి. నన్ను మాత్రం అపార్థం చేసుకోకండి. మా నాన్న మీ ఉద్యోగం ఎట్లాగయినా నిలబెట్టి నన్ను మీకు యిచ్చి వివాహం చేయాలని అనుకుంటున్నారు. మీరేమో ఉద్యోగం మానివేసి—ఆయన ఎంత చెప్పినా వినకుండా కూర్చున్నారుట. మా నాన్న ఈ బెంగతో నాలుగు రోజులనుంచీ సరిగ్గా అన్నంకూడా తినడం లేదు. నా తరవాత యింకా యిద్దరు ఆడపిల్లలున్నారు. వాళ్ళకి పెళ్ళీడే. దయచేసి మా నాన్నమాట వినండి. మీకు పుణ్యం వుంటుంది”—గబగబ యీ మాటలు చెప్పేసిన తరువాత సరోజ మనస్సు చాల తేలిక పడినట్లు అయింది. ఆమె రాంమూర్తి ముఖంలోకి చూడాలని అనుకుంది. కాని ఆ పని ఆమెకు సాధ్యం కాలేదు.

ఆమె మాటలు రాంమూర్తిని ఆశ్చర్యంలో ముంచివేశాయి. శంకరం గారికి యింతపెద్ద ఆలోచన వున్నదని అతనెప్పుడూ ఊహించనయినా లేదు. అయితే అతను—యీ ఆశ్చర్యం అంచటినుంచీ ఒక్క నిమిషంలోనే తేరుకో గలిగాడు.

"చూడండి, నాకు పుణ్యం అక్కర్లేదు. నేను మీ నాన్నగారి మాట వినను. మీ మాటే వింటాను" అన్నాడు.

సరోజ అయోమయంలో పడింది. అర్థం కానట్లుగా అతని ముఖం వంక చూచింది. రాంమూర్తి మళ్ళీ యిట్లా అన్నాడు: "నాకు ఉద్యోగం వున్నా లేకపోయినా మీకేం యిబ్బంది లేదుగా. మీ నాన్నగారి సంగతి అలా వదిలివేయండి. మీకు నిజంగా యిష్టం అయితే మనమిద్దరం పెళ్ళి చేసుకుందాం,"

"నాన్న....నాన్న...." అంది సరోజ అయోమయంగా.

"ఆయన సంగతి వదిలెయ్యమన్నానుగా. నాకు మళ్ళీ యెక్కడేనా ఉద్యోగం దొరికితే ఆయనే మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తారు. మీకు నిజంగా యేమీ అభ్యంతరం లేదుగా–చెప్పండి."

సరోజ కళ్ళు సంతోషంతోమిలమిల మెరిశాయి. ఆమె నోటితో యేమీ జవాబు చెప్పలేకపోయింది. *

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)